

'కౌలు'కు ఉరి

- భూధార్‌తో నష్టపోతున్న కౌలు రైతులు
- యజమానులకే విశిష్ట గుర్తింపు సంఖ్య
- కూటమి సర్కార్‌పై వ్యక్తమవుతున్న ఆగ్రహం

కేంద్రంలోని మోడీ సర్కార్ కౌలురైతులకు చేస్తున్న అన్యాయానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సై అంటూ ముందుకు సాగుతోంది. ప్రభుత్వం అందించే ప్రతి సాయమూ భూయజమానులకే దక్కేలా తెచ్చిన 'భూధార్' కౌలురైతులకు ఉరితాడుగా మారుతోంది. ఈ విధానం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో కూటమి సర్కార్‌పై కౌలు రైతుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది..



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పౌరుల గుర్తింపునకు ఆధార్ కార్డు తరహాలో రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం భూధార్ కార్డుల జారీ ప్రక్రియను తెరపైకి తెచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వంతపాడుతూ భూయజమానులందరికీ భూధార్ కార్డులు అందించే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టింది. ఈ నెల 27వ తేదీలోపు 30 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది. దీంతో రబీ సాగులో రైతుల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేసి వ్యవసాయ అధికారులంతా భూధార్ ప్రక్రియలో నిమగమయ్యారు. 11 అంకెలు గల విశిష్ట సంఖ్యతో భూధార్ కార్డులను భూములున్న యజమానులకు అందజేసే ప్రక్రియ సాగుతోంది. ఇక నుంచి భూధార్ ఆధారంగా రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలు, వ్యవసాయ సంబంధిత సేవలు, యంత్రాల అందజేత, పంటల బీమా, పిఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందనున్నాయి. వ్యవసాయ సాగులో భూయజమానుల పాత్ర చాలా తక్కువగా ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తూ అందరికీ అన్నం పెడుతున్న పరిస్థితి ఉంది. వాస్తవ సాగుదారులకు ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎప్పటి నుంచో కౌలురైతులు పోరాటం చేస్తున్నారు. అందులో భాగంగానే 2011లో కౌలురైతుల చట్టం వచ్చింది. 2019లో ఆ చట్టాన్ని సవరిస్తూ భూయజమానుల అంగీకారంతోనే కౌలుకార్డులు ఇవ్వాలని వైసిపి ప్రభుత్వం చేసిన చట్టం కౌలురైతుల బతుకులపై తీవ్ర ప్రభావం చూపింది. తాము అధికారంలోకి వస్తే నూతన కౌలుచట్టం తెచ్చి కౌలు రైతులను ఆదుకుంటామని కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చాక దానికి భిన్నంగా కేంద్రంతో కుమ్మక్కై భూయజమానులకు భూధార్ ప్రక్రియను వేగంగా సాగిస్తోంది. భూదార్ కార్డుల జారీతో ఇక కౌలు రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే ఏఒక్క సాయమూ అందకుండాపోనుంది. కౌలుచట్టాలు సైతం పూర్తిగా నిర్వీర్యం కానున్నాయి. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు తీరని అన్యాయం చేస్తున్న పరిస్థితి ఉంది. వ్యవసాయ సాగు చేయని భూయజమానుల జేబుల్లోకి ప్రభుత్వ సాయం వెళ్లనుంది. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కౌలురైతుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

వలసలు నివారణకు శాశ్వత పరిష్కారమేది?

- యూరియా కొరతపై వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం
- 77 చెరువుల నింపడంలో జాప్యమెందుకు
- జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి
- స్థాయి సంఘాల సమావేశంలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

'కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ప్రజలు వలసలు వెళ్తున్నారు. అక్కడ వలసలు నివరించేలా శాశ్వత పరిస్కారం ఎందుకు చేయడంలేదు. కనీసం ప్రభుత్వం దృష్టికి అధికారులు నివేదికలు ఇవ్వాలి' ఎందుకు ఇవ్వడం లేదని డ్వామా అధికారులపై జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం మినీమీటింగ్ హాలులో చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, విద్య వైద్యం, మహిళ సంక్షేమం, వ్యవసాయం, నీటి పారుదల శాఖ, ఆర్థిక బడ్జెట్‌పై చర్చించారు. చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కనీస కూలీ రాకపోవడం వల్ల వలసలు అధికమయ్యాయన్నారు. పనులు కల్పించినా నేటికి కూలీలు అందలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా వలసలు నివారిస్తారన్నారు. వలసలు లేకుండా శాశ్వత పరిష్కరానికి అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తే బాగుంటుందన్నారు. వ్యవసాయ శాఖ గురించి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత తీవ్ర సమస్యగా మారిందన్నారు. రైతుల ఇబ్బందులు ఎవ్వరు పట్టించుకోలేదని, వ్యవసాయ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంతో పని చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి దినపత్రికలో యూరియా కొరత గురించి సమస్యలను ప్రస్తావించినా స్పందించలేదని, ఆయా పత్రికల క్లిప్పింగులను సభలో చూపించారు. కట్టింగ్స్‌ను చూపించారు. 77 చెరువులు పూర్తిగా నింపడంలో అలసత్వం ఉందని, ఎందుకు నేటికి నింపలేదని అడుగగా నీటిపారుదల అధికారులు మాట్లాడుతూ ఇప్పటికి 63 చెరువులు నింపామని మిగతావి మార్చి చివరినాటికి నింపుతామన్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ ఆదోని అతిపెద్ద మండలం అలాంటి మండలంలో మరుగుదొడ్ల సమస్య చాలా తీవ్రంగా ఉందని, ఇప్పటికైనా ఆ సమస్య తీర్చేలా అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే సమావేశం లోపు ఎలాంటి పురోగతి ఉందో చెప్పాలన్నారు. ఆరోగ్య శ్రీ సేవల్లో చాలా హాస్పిటల్స్‌లో డబ్బులు వసూలు చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆరోగ్య శ్రీ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. లోన్ ల విషయంలో జిల్లాలో 271 బ్యాంక్ లలో ఒక్కరు కూడా విద్యకు సంబంధించిన లోన్ పూచి లేకుండా ఇచ్చిన బ్యాంక్ లేదన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యకు ఎలాంటి పూచి లేకుండా లోన్ ఇవ్వాలని తెలిపినా ఒక్క బ్యాంక్ కూడా ఆ విధమైన చర్యలు తీసుకోలేదని ఆగ్రహించారు. బ్యాంకుల విషయంలో మారాలని లేకుంటే అసెంబ్లీలో చర్చిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న గుడ్ల లో 55 గ్రాములు ఉండాల్సిన గుడ్డు 35 గ్రాములు కూడా లేదని ఇంత దారుణంగా ఉంటే ఎలా అని అన్నిటినీ తూకం వేసి చూస్తే కానీ తెలీదని చురకలంటించారు. జడ్‌పిటిసిలు వారి మండలాల్లోని సమ్యలను ప్రస్తావించారు. జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లా జడ్‌పిటిసిలు ,ఉమ్మడి జిల్లా వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిషత్ అధికారులు జితేంద్ర, అశ్విని కుమార్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు. జిల్లాలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేయాలన్నారు. గురువారం కార్మిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పరిశ్రమల శాఖ, మత్స్యశాఖ, డిఆర్‌డిఎ, మెప్మా, డ్వామా, వ్యవసాయ, ఐసిడిఎస్ శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు అవసరమైన సమయాల్లో ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని, అసంఘటిత రంగ కార్మికులకు ప్రమాదాలు జరిగినపుడు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద, మరణ, అంగవైకల్య బీమా ఉచితంగా లభిస్తుందని తెలిపారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లాలో నిర్వహించనున్న ఎపిపిఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సిబ్బంది ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పి4 సర్వే (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్) ద్వారా 20 శాతం అత్యంత పేదరికం కలిగిన వాళ్ళను గుర్తించడం జరుగుతోందన్నారు. మొదటి దశలో పి 4 సర్వే జరుగుతున్న జిల్లాల్లో కర్నూలు జిల్లా కూడా ఒకటని, ఈనెల 20 నుంచి మార్చి 2 వరకు ఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు ఎంపిడిఒలు స్టాటిస్టికల్ అధికారులతో సమన్వయం చేసుకుని, సచివాలయ సిబ్బంది ద్వారా పి4 సర్వేని పూర్తిచేయాలన్నారు. ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే గ్రూప్-2 పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలో మార్చి 1 నుంచి 20 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం కూడా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, సిపిఒ హిమ ప్రభాకరరాజు, ఆర్ఐఒ గురవయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు..


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, జెసి నవ్య

రెవెన్యూ సమస్యల పరిష్కారం ఎక్కడ..?

- సాగు చేస్తున్నా ఆన్‌లైన్‌లో ఎక్కని భూమి
- ఇబ్బంది పడుతున్న పేద రైతులు
- రెవెన్యూ అర్జీల పరిష్కారం నామ మాత్రమే

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ సదస్సుల పేరుతో భూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. వాస్తవానికి ప్రకటనలు మాత్రం ఆచరణలో అమలకు నోచుకోవడం లేదు. అనేక సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్న రైతుల భూములను మాత్రం ఆన్‌లైన్ నమోదు కావడం లేదు. ఆన్‌లైన్ భూమి నమోదు కాకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి ఆర్థిక సాయంతో పాటు ఇతర పంట నష్టపరిహారం పొందలేక ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది డిసెంబర్ నెలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. ఈ సదస్సులో ప్రధానంగా భూ రెవెన్యూ సమస్యలకు సంబంధించిన వాటి దరఖాస్తులను బాధితుల నుండి స్వీకరించారు. ఓర్వకల్ మండలంలో రెవెన్యూ సదస్సులో 664పైగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో అత్యధికంగా దరఖాస్తులు వచ్చినటువంటి మండలం కూడా ఓర్వకల్ మండలమే. ఈ దరఖాస్తుల్లో దాదాపుగా 80 శాతం పరిష్కరించినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు. 464 దరఖాస్తులను ఇప్పటివరకు పరిష్కరించినట్లు రెవెన్యూ అధికారులే చెబుతున్నారు. ఈ సదస్సుల్లో ప్రధానంగా ఆన్‌లైన్ సమస్య, భూ వివరాలను రెవెన్యూ రికార్డులో నమోదు చేయకపోవడం పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరు వంటి దరఖాస్తులు వచ్చాయి. భూమి వివరాల నమోదులో తక్కువగా నమోదు చేసినట్లు వంటి వాటిపై అధిక సంఖ్యలో వచ్చాయి. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు కూడా పలు రకాల కారణాలు చూపించి వాటిని పరిష్కరించినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు.


రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న అధికారులు

రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం లేదు

- బి.నాగన్న, సిపిఎం మండల కార్యదర్శి



ఓర్వకల్లు మండల పరిధిలోని అనేక గ్రామాల్లో భూ రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు అర్జీల ద్వారా విన్నవించాం. గతంలో అనేకసార్లు అర్జీలు ఇచ్చిన పట్టించుకోలేదు. అసలు రెవిన్యూ సమస్యలను మాత్రం పరిష్కరించడంలో వైఫల్యం చెందుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ సదస్సులో వచ్చిన బాధితుల అర్జీలకు న్యాయం జరగాలంటే వాటిని క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన చేసి పరిష్కరించాలి.

ఆన్‌లైన్ భూమి ఎక్కించడం లేదు

- టి.శివ రాముడు, కన్నమడకల గ్రామం



సర్వేనెంబర్ 379/2, బి1.15 ఎకరాలు పట్టా భూమి సాగు చేసుకుంటున్నా. గతంలో రీ సర్వే చేయకముందు ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ రీ సర్వే అనంతరం తీసేశారు. ఇప్పుడు ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతున్న రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు.

పాసుబుక్కు మంజూరు చేయడం లేదు

- సుబ్బమ్మ, నన్నూరు గ్రామం



సర్వేనెంబర్ 157లో దాదాపుగా1.95 ఎకరాల భూమిని సాగు చేస్తున్నాం. గతంలో జిల్లా కలెక్టరుకు రెవిన్యూ అధికారులకు అనేకసార్లు పాసుబుక్ మంజూరు చేసి ఆన్‌లైన్ భూమిని ఎక్కించాలని అనేకసార్లు విన్నవించుకున్నాం. ఇప్పటివరకు పట్టించుకోవడం లేదు.

రెవెన్యూ అర్జీలన్నింటినీ పరిష్కరిస్తాం

- విద్యాసాగర్, తహశీల్దార్



రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు అన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా ఎవరికైనా భూ రెవెన్యూ సమస్యలు ఉంటే నేరుగా వచ్చి విన్నవించుకుంటే వాటిని క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన చేసి పరిష్కరిస్తాం.

ఆలోచించు



నీవు –
అమ్మతో ఆడుతూ పాడుతూ,
నాన్నతో పరుగులు పెడుతూ,
అర్థం కాని భాషలో ఏదేదో పలుకుతూ
నీ భావాన్ని తెలపాలని తహతహలాడుతూ,
అమ్మనూ నాన్ననూ తట్టి తట్టి
ఎలా చెప్పాలని ప్రశ్నార్థకంగా
చూస్తున్నప్పుడు
మెత్తగా, తియ్యగా నిన్ను ముద్దు చేస్తూ,
మురిపెంగా నీతో 'నన్ను' పలికిస్తూ మురిసి పోలేదా మా పాపడికి
మాటలొస్తున్నాయని ?
నీవు మాటనేర్చి, పాట నేర్చి,
ఆట నేర్చి, అక్షరం నేర్చి,
యింత వాడివై, విదేశీ భాషా వ్యామోహంతో
నన్ను పలకాలన్నా, చూడాలన్నా
ఎందుకంత చిన్న చూపు?
అప్పుడు -
" మా తెలుగు తల్లికి మల్లె పూదండ..."
బడిలో మధురంగా పాడిన నిన్ను చూసి555
పొంగి పోయిన అమ్మ,
ఇప్పుడు -
అమ్మ నేర్పిన పాట అమ్మ భాషలో
వ్రాయలేక 'చరవాణి'లో ఆంగ్లలిపిని తస్కరించి పాడితే, మాతృబాష '
పలకను 'చదవను' వ్రాయను' తల ఎగరేసి, పరభాషకు 'జై' కొడితే, అమ్మ
మనసు ఎంత గాయపడుతుందో ఆమె తలదించుకోవలసి వస్తుందో
ఆలోచించించు.

-డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా రచయిత కర్నూలు

ఎల్‌ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలి

- మెజారిటీ సంఘానికి గుర్తింపు పునరుద్ధరించాలి
- ఎల్ఐసి సిబ్బంది ఒక గంట సమ్మె విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎల్‌ఐసిలో గత ఏడేళ్లలో 15 వేల మంది ఉద్యోగులు తగ్గారని, సంస్థ కోసం, పాలసీదారుల కోసం తక్షణం నూతన నియామకాలు చేపట్టాల్సిందేనని ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం కర్నూలు కార్యదర్శి సునీయ కుమార్ డిమాండ్ చేశారు. ఎల్‌ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట అధ్యక్షుడు మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఒక గంట దేశవ్యాప్త సమ్మె కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇన్సూరెన్స్ రంగం రూపురేఖలు మారిపోతున్న దశలో, నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పనిచేయాలంటే ఉన్నత విద్యావంతులైన, హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువత నూతన ఉద్యోగులుగా నియమించుకోవాల్సిన అవసరం ఎల్‌ఐసికి ఉందని అన్నారు. జవాబుదారీతనం లేని ఔట్‌సోర్సింగ్ స్థానంలో రెగ్యులర్ నియామకాలే పరిష్కారమన్నారు. యుపిఎస్‌సి తరహాలో ప్రతి ఏటా ఎల్‌ఐసిలో అవసరమైన మేరకు నియామకాలు చేపట్టాలన్నారు. దేశంలో ఉన్న 80 శాతం ఎల్‌ఐసి సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమ సంఘం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) కు గుర్తింపు పొందిన సంఘంగా హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంస్థ కోసం, పాలసీదారుల కోసం, సిబ్బంది కోసం విశాల దృక్పథంతో పనిచేస్తున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం భారత కార్మికోద్యమ చరిత్రలో ఆదర్శప్రాయమైనదన్నారు. ఆ సంఘానికి గుర్తింపు పునరుద్ధరించడమంటే సంస్థలో ప్రజాస్వామిక సాంప్రదాయాలు నిలపడమేనని చెప్పారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, యుఎఫ్‌బియు జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎపిజివిబి జనరల్ సెక్రెటరీ, హనుమంత రెడ్డి, బిఎస్‌ఎన్ఎల్ యూనియన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జనరల్ ఇన్సూరెన్స్ నాయకులు జంధ్యాల రఘుబాబు, ఎపిజివిఎస్‌సి, ఎస్‌టి జనరల్ సెక్రెటరీ నాగరాజు, మెడికల్ రెప్స్ యూనియన్ అధ్యక్షులు ప్రసాద్ శర్మ, ఎస్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూఐ కార్యదర్శి కృష్ణ ప్రసాద్, లియాఫీ సెక్రెటరీ వెంకట్ లు సంఘీభావాన్ని తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు, పని భారాన్ని తగ్గించేందుకు, పదవి విరమణ చేసిన వారి స్థానంలో కొత్త వారిని తప్పనిసరిగా నియామకం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంస్థలోని వివిధ తరగతుల సంఘాల డివిజన్ నాయకులు మాట్లాడుతూ బలమైన ఎల్‌ఐసి మాత్రమే బలమైన దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైనదని, ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఎల్‌ఐసి యాజమాన్యం ఏకపక్ష ధోరణులు మాని ప్రజాస్వామికంగా వ్యవహరించాలన్నారు. మహిళా ఉద్యోగులు ఎర్రటి దుస్తులతో సమ్మెలో పాల్గొని వారికి యూనియన్ మీద ఉన్న గౌరవాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల నాయకులు రమేష, అంబుజాసింగ్, అబ్దుల్‌గని, హెచ్ఎన్ఎస్ భాస్కర్, క్రాంతికుమార్, జాకీర్ భాష తదితరులు పాల్గొన్నారు.



నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న సునీయకుమార్


సమీక్షలో సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఇతర వైద్యులు

గులియన్ బారే సిండ్రోమ్ లక్షణాలపై సమీక్ష

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గులియన్ బారే సిండ్రోమ్ లక్షణాలు, పేషెంట్లకు అందుతున్న వైద్యం తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులియన్ బారే సిండ్రోమ్ లక్షణాలు దీని బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరం, వాంతులు కావడం లాంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. కలుషిత ఆహారం ద్వారా ఇది సోకుతుందని ఈ వ్యాధి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపైనే తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. నాడీ వ్యవస్థను ఈ వైరస్ దెబ్బతీసి రోగి పక్షవాతం బారిన పడతాడని అయితే సకాలంలో వైద్యం అందితే ముప్పు ఉండదని తెలిపారు. ప్రజలు దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదని అన్నారు. కాళ్లు, చేతులు స్పర్శ కోల్పోయినట్టు అనిపిస్తే వెంటనే ఆస్పత్రికి రావాలని ప్రజలకు సూచించారు. ఈ వ్యాధి సోకిన వెంటనే చికిత్స అందిస్తే బాధితులకు పూర్తిగా కోలుకుంటారని ఆందోళన అవసరం లేదని అన్నారు. చికిత్సకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. గులియన్ బారే సిండ్రోమ్ లకు నోడల్ అధికారిగా డాక్టర్ దామం శ్రీనివాసులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ హెచ్ఒడి డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, న్యూరాలజీ హెచ్ఒడి డాక్టర్ శ్రీనివాసులు, పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

23న సుందరయ్యభవన్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఇందిరాగాంధీ నగర్ లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు మెడికల్ క్యాంప్ సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, జిబిఆర్ ఫౌండేషన్, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్, ప్రజాఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ప్రసాద్ శర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్యాంపు ప్రతి రెండు నెలలకు ఒకసారి నాలుగో ఆదివారం నిర్వహించే విషయం తెలిసిందే. ఈ క్యాంపునకు వచ్చువారు బిపి, షుగర్ పరీక్షలు చేయించుకుని ఆ రిపోర్టు తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా పక్షవాతం, బిపి, షుగర్, ఫిట్స్ (మూర్ఛ) వ్యాధులకు డాక్టర్లు సూచించే మందులు తక్కువ ధరకే క్యాంపుకు వచ్చేవారికి ఇస్తామన్నారు. ఈ సదవకాశాన్ని కర్నూలు నగరం, సమీప గ్రామాలు, మండలాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అవసరం

- ఉషూ క్రీడాకారులకు దుస్తులను పంపిణీ
- సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

బాలికలకు ఆత్మ రక్షణ కోసం కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఎంతో అవసరమని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని క్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో ఈనెల 20, 21వ తేదీల్లో రాజమండ్రిలో జరగనున్న ఖేల్ ఇండియా క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తున్న 66 మంది ఉష క్రీడాకారులకు ఆయన క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఉషా శిక్షకుడు టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ రాజమండ్రిలో జరిగే ఖేల్ ఇండియా క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన ఉషా క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలన్నారు. రాజమండ్రి లాంటి సుదూర ప్రాంతాలకు వెళుతున్న బాలికలు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలుషితమైన నీరు తాగకుండా పరిశుభ్రమైన నీరు తాగాలని సూచించారు. కలుషితమైన నీరు తాగడం వల్ల టైఫాయిడ్, కలరా, జాండీస్, జీర్ణకోశ సంబంధ వ్యాధులు వస్తాయని వివరించారు. ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం వల్ల ఆత్మ రక్షణతో పాటు దేహదారుఢ్యం మెరుగుపడుతుందని వివరించారు. కరాటే సాధన చేసే క్రీడాకారుల్లో ఆత్మస్థైర్యం మెరుగుపడి ఏకాగ్రత కూడా పెరుగుతుందని వివరించారు. తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. కర్నూలు నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని డాక్టర్ శంకర శర్మ స్పష్టం చేశారు.



క్రీడాకారులకు దుస్తున్న పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

సురేంద్ర కుటుంబాన్ని ఆదుకుంటాం

సంతాప సభలో టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్




ఆంధ్రజ్యోతి కెమెరా మెన్ సురేంద్ర అతిచిన్న వయసులో గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని ఆయన కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సురేంద్ర సంతాప సభను ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు ఎపియుడబ్ల్యుజె నాయకులు సురేంద్ర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి వివిధ పెద్దలు ,మీడియా వారు ఆర్థిక సహాయాన్ని అందించారు. పిల్లలకు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు, ఐజెయు నాయకులు కొండప్ప, ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు ఇఎన్ రాజు,జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యపై కదం తొక్కుదాం

- 28న కర్నూలులో జిల్లా సదస్సు - కెజిబిఎస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

కాటికాపరుల సమస్యల పై కదం తొక్కుదామని ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎమ్.డి.ఆనంద్ బాబు కోరారు. గురువారం స్థానిక ప్రయివేట్ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఎస్‌జికెఎస్ మండల కార్యదర్శి సురేష్ అధ్యక్షత వహించా రు. ఆనంద్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కదం తొక్కడానికి సిద్ధం కావాలని కోరారు. చనిపోయిన వారికి శ్మశానంలో గుంతలు తీసి పూడ్చే, కాల్చే వృత్తిని నిర్వహిస్తున్నా, నేటికీ ప్రభుత్వా లు ఈ వృత్తిని ఒక వృత్తిగా గుర్తించలేదన్నారు. అంటరానితనం, అవమానాలను భరిస్తూ రోగాలు రొప్పులతో బతుకీడుస్తూ, అర్ధాకలితో జీవిస్తున్నా ప్రభుత్వాలకు కనికరం లేకుండా పోయిందన్నారు. ఈనెల 28న శ్మశానంలో గుంత తీసి పూడ్చే, కాల్చే కాటికాపరుల సంఘం జిల్లాస్థాయి సదస్సు కర్నూలులో నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సు ద్వారా కార్యాచరణ రూపొందించి భవిష్యత్తు పోరాటాలను ఉధృతం చేద్దామని చెప్పారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, మండల కార్యదర్శి గర్జి అంజి, మండల మాజీ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, అనిల్, ఎస్‌జికెఎస్ మండల అధ్యక్షులు మారెప్ప, నాయకులు రాజు, నరసన్న పాల్గొన్నారు.

అద్దాల పంపిణీ హర్షణీయం : ఎమ్మెల్యే బీవీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కంటిచూపు లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా రాష్ట్రవ్యాప్తంగా కంటి అద్దాల పంపిణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం హర్షణీయమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సోగునూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యక్రమంలో భాగంగా కంటి చూపు లోపం ఉన్న విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 9,882 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 382 మందిని గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... కంటిచూపుపై జాగ్రత్త వహించాలని, నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, జిల్లా అధికారి సంధ్యారెడ్డి, ఎంఇఒ మధుసూదన్ రావు, గోవిందరాజులు, టిడిపి నాయకులు రంగస్వామి గౌడ్ పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - కోసిగి



తహశీల్దార్ రుద్ర గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్ కోరారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో వందలాది మంది రైతులు వేల ఎకరాల్లో మిరప పంట సాగు చేశారని, సాగుకు ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. కల్తీ ఎరువులు, తెగుళ్ల సోకి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ధర కూడా పడిపోవడంతో పెట్టుబడి కూడా రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మిరప పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని, క్వింటాకు రూ.50 వేల గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. మిరప రైతు రుణాలు మాఫీ చేయాలని, పంటకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రుద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం మండల అధ్యక్షులు పూజారి శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, మిరప రైతులు ఈరన్న, కోసిగయ్య, పోతుల మూసయ్య, హనుమంతు, ముక్కిరయ్య, రామకృష్ణ, రాముడు, బావి గడ్డ ప్రకాష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమర్థవంతంగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ

- ఎంపిడిఒ పుల్లయ్య

ప్రజాశక్తి - నందవరం

చెత్తసంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. విస్తరణాధికారి సందీప్, ఎఎస్ఒ సూరి ప్రకాష్ పాల్గొన్నారు.

రైతు కంట కన్నీరు..!

- తెల్లగా మారిన మిరప పంట
- తగ్గిన దిగుబడులు
- పెట్టుబడులు రాని పరిస్థితి
- అప్పులతో రైతులు విలవిల

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో మిరప పంట సాగు చేసిన రైతు కంట కన్నీరు కారుతోంది. మిరపకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఈఏడాది వర్షాలు బాగా కురవడంతో దిగుబడులు బాగా వస్తాయని, తమ కష్టాలు తీరుతాయని మిరప రైతులు ఆశపడ్డారు. వారి ఆశలపై ప్రకృతి కన్నెర్ర చేసింది. అకాలవర్షం కురవడంతో వారి ఆశలు అడియాశలు అయ్యాయి. ఎర్రగా పండాల్సిన మిరప పంట.. తెల్లకాయలు ఎక్కువగా ఉండడంతో దిగుబడులు తగ్గి, పెట్టుబడులు రాక అప్పులు మిగిలాయి..!

మంత్రాలయం నియోజకవర్గంలో మిరప పంటను గణనీయంగా సాగు చేశారు. తుంగభద్ర దిగువ కాలువ కింద సారవంతమైన భూములు ఉండడంతో పత్తి పంటతో పాటు వరి, మిరపను రైతులు సాగు చేశారు. గతేడాది మిరప పంటకు మంచి ధర లభించడంతో ఈఏడాది కూడా రైతులు ఎంతో ఆశతో మిరప పంటను ఎక్కువగా సాగు చేశారు. కౌతాళం మండలంలో 15 వేల ఎకరాలు, పెద్దకడబూరులో 13 వేల ఎకరాలు, మంత్రాలయంలో 5 వేల ఎకరాలు, కోసిగి మండలంలో 2 వేల ఎకరాల్లో మిరప పంట సాగయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మిరప పంటపై ప్రకృతి కన్నెర్ర చేసింది. అకాల వర్షం కురవడంతో ఎర్రగా ఉండాల్సిన మిరప పంట తెల్లగా ఉండడంతో రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. 100 మిరప పంట బస్తాలు తీసుకొస్తే, కూలీల ద్వారా వేరు చేస్తే 70 నుంచి 80 బస్తాలు తెల్ల



తెల్లగా మారిన మిరప పంట

కాయలు, కేవలం 20 బస్తాలు ఎర్ర కాయలు రావడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఒకవైపు దిగుబడిలో లేక, మరోవైపు మద్దతు ధర లేక, వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలైన రైతులు దిక్కులు చూస్తున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందా..? లేక అప్పుల తీర్చడానికి ఆస్తులు అమ్ముకోవాలా.. తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య



మిరప రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. రైతులకు దిగుబడులు రాక, మద్దతు ధర లేక అప్పుల పాలవుతున్నారు. ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి.

ఈ ఏడాది అప్పులే మిగిలాయి

- రైతు, సక్రి తిక్కయ్య, కౌతాళం



మూడెకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెట్టాను. రూ.3 లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టగా రూ.లక్ష దిగుబడి కూడా రాలేదు. మిరప పంట సాగు చేసిన రైతులకు ఈ ఏడాది అప్పులే మిగిలాయి.

రైతులను ఆదుకోవాలి

- రైతు పీర్ సాబ్



మిరప సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. మద్దతు ధర లేకపోవడంతో, పెట్టిన పెట్టుబడులు రాక రైతులు కష్టాలు పడుతున్నారు. ఎకరా పంట సాగు చేశాను. దిగుబడులు చూస్తే వచ్చిన డబ్బులు కూలీలకే సరిపోతాయి. రైతులకు మాత్రం అప్పులే మిగులుతాయి.

రైతుల్లో మార్పు రావాలి

- అపర్ణ, హార్టికల్చర్, అధికారి, మంత్రాలయం



వ్యవసాయ రంగంలో రైతుల్లో మార్పులు రావాలి. పంట మార్పిడి, మిరప పంటలో అంతర్ పంటలు (బంతిపూలు తదితర) వేయాలి. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ఆర్గానిక్ ఎరువులు వాడాలి. ఉద్యానవన శాఖ, వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలి. అప్పుడే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. పంట నాణ్యతను బట్టి మార్కెట్‌లో ధరలు లభిస్తాయి. పంట పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం.

ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి



అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో పేదలు ఇంటి నిర్మాణం చేపట్టి ఉంటే అలాంటి ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ల్యాండ్ రెగ్యులజేషన్ స్కీం 2025 పేరిట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆక్రమించుకున్న భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. కొత్త జిఒ 30 మేరకు 2019 అక్టోబర్ 15న కట్ ఆఫ్ డేట్‌గా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఆ తేదీ కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటేనే క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇందుకు వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల్లోపు ఉండాలని, మెట్ట భూమి పదెకరాల్లోపు ఉండాలని తెలిపారు. మాగాని భూమి మూడెకరాల్లోపు ఉండాలని, కుటుంబంలో ఎవరైనా రాష్ట్ర, కేంద్ర శాఖలో ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదని చెప్పారు. కరెంట్ వినియోగం 300 యూనిట్లలోపు ఉండాలన్నారు. మహిళల పేరిటనే ఇంటిని క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. అర్హత ఉన్నవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు సచివాలయంలో రెవెన్యూ కార్యదర్శి లేదా తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న అధికారులను సంప్రదించాలని కోరారు.

నాటు సారా అడ్డుకట్టకు చర్యలు

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

నాటుసారా రహిత ప్రాంతంగా ఆదోనిని మారుద్దామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం జిఒ 17ను విడుదల చేసిందన్నారు. నవోదయం 2.0ని డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈనెల 19న లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. ఆదోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల నాటుసారా తయారీ రవాణా, అమ్మకాలను నిర్మూలించడానికి రెవెన్యూ, పోలీసు, అటవీ, ఇతర శాఖల అధికారుల సహకారం తీసుకుంటామన్నారు. మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సారా నిర్మూలనకు కార్యాచరణ మొదలు పెట్టినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన సర్పంచులు, పెద్దలు, పట్టణ కౌన్సిలర్లు, స్వయం సహాయక బృందాలు, మహిళా పోలీసుల సహకారం తీసుకొని నవోదయం-2ను విజయవంతం చేద్దామని తెలిపారు.

నేటి నుంచి వన్నూరు స్వామి ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని కరివేముల గ్రామంలో వెలసిన శ్రీవన్నూరు స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమై ఆదివారం ముగియనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. శుక్రవారం స్వామివారి గంధం, శనివారం ఉరుసు, ఆదివారం జియారత్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉరుసు ఉత్సవాల సందర్భంగా దర్గాను ప్రత్యేకంగా విద్యుద్దీపాలంకరణతో అలంకరించినట్లు తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తాదులకు అన్ని రకాల సౌకర్యాలూ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతిఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లాలి: ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆస్పరి

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లాలని ఎంపిడిఒ గీతావాణి సూచించారు. గురువారం ఆస్పరిలో ఉపాధి హామీ పనులను పరిశీలించి, మస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మస్టర్‌లో అవకతవకలు జరగకుండా పనులకు వచ్చిన వారి పేర్లను మాత్రమే హాజరు వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వలసలను నివారించడానికి ఉపాధి హామీ పనులు కల్పిస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయని, ఉదయాన్నే పనులకు వెళ్లి 11 గంటలకంతా ఇంటికి చేరుకోవాలని సూచించారు. అధికారులు చెప్పిన ప్రకారం కొలతలు పట్టుకొని పనులు చేస్తే రూ.300 కూలి పడుతుందని పేర్కొన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో పెట్టుకోవాలని కోరారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. టిఎ కాశన్న, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



కూలీల మస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ గీతా వాణి

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి మార్చాలని ప్రయత్నం చేస్తున్నారని, అది సరైనది కాదని హితవు పలికారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండడానికి అవసరమైన అన్ని రకాల అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కలుస్తున్న బ్యాంకులతో పోలిస్తే వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉందని, బ్రాంచీల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. అన్ని బ్యాంకుల కంటే ఎక్కువ ఎటిఎంలు కలిగిన బ్యాంకుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉందని చెప్పారు. సొంత కార్యాలయం కలిగి ఉందని, వ్యవసాయ దారులకు, చిన్న వ్యాపారులకు రుణాలు ఇవ్వడానికి అవసరమైన శక్తిసామర్థ్యాలు ఈ బ్యాంకుకే ఉన్నాయని తెలిపారు. సిఐటియు మండల నాయకులు జయరాజు, ప్రాణేష్, పెద్దకడబూరు మండల కార్యదర్శి ఈరన్న, మండల నాయకులు లక్ష్మన్న, అంజి, రాజు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్ఐసిలో నియామకాలు చేపట్టాలి

- ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఎల్ఐసిలో ఖాళీలను భర్తీ చేసి ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని ఎల్ఐసి బ్రాంచి ప్రధాన కార్యదర్శి రవిబాబు డిమాండ్ చేశారు. గురువారం బ్రాంచి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. వివిధ ఉద్యోగ సంఘాల నేతలు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్షులు తిప్పన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఏడేళ్లలో 15 వేల మంది ఉద్యోగులు తగ్గారని, సంస్థ కోసం పాలసీదారుల మెరుగైన సేవల కోసం నియామకాలు చేపట్టాలని కోరారు. హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువత నూతన ఉద్యోగులను నియమించాల్సిన అవసరం ఎల్ఐసికి ఉందని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ స్థానంలో సాధారణ నియామకాలే పరిష్కారమన్నారు. యుపిఎస్‌సి తరహాలో ప్రతి ఏడాది ఎల్ఐసిలో అవసరమైన నియామకాలు చేపట్టాలన్నారు. సంస్థ, పాలసీదారుల కోసం, సిబ్బంది కోసం పని చేస్తున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం కార్మికోద్యమ చరిత్రలో ఆదర్శప్రాయమైందని, ఆ సంఘానికి గుర్తింపు పునరుద్ధరించడమంటే సంస్థలో ప్రజాస్వామిక సాంప్రదాయాలు నిలపడమేనని తెలిపారు. ఎల్ఐసి ఏజెంట్ లియాఫి నాయకులు సిద్ధ లింగ, రామకృష్ణ సంఘీభావం తెలిపారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు ధర్మరాజు, ప్రకాష్,



ఆదోనిలో నిరసన చేపడుతున్న ఉద్యోగులు

రాజశేఖర్ ఉన్నారు. **ఎమ్మిగనూరులో** ఎల్ఐసి పరిరక్షణ కోసం ఉద్యోగులు గంటసేపు ధర్నా చేపట్టారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు రాము, సహాయ కార్యదర్శి రఘునాథ్ గౌడ్, ఎల్ఐసి క్లాస్-1 ఉద్యోగుల సంఘం నాయకులు మహేష్ కుమార్, ప్రతాప్ కుమార్, క్లాస్-2 ఉద్యోగుల సంఘం నాయకులు రామకృష్ణ, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, లియాఫీ (ఏజెంట్ల సంఘం) బ్రాంచి అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఉద్యోగుల సంఘం నాయకులు గోవర్ధన్, మురళీ, శంకర్, బ్రహ్మానందరెడ్డి, వీరారెడ్డి, వినయ్ కుమార్, సురేష్, శ్రీవాణి పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో నిరసన

డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేసే అర్హత కలిగిన ఉద్యోగులకు 2024 డీఎస్సీలో ప్రాధాన్యత మార్కులు కేటాయించాలని గోనెగండ్ల మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్-2 ఉపాధ్యాయ పోస్టులకు అన్ని అర్హతలు కలిగిన తాము అనేక సంవత్సరాలుగా సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం 2024 డీఎస్సీలో తమకు కచ్చితంగా వెయిటేజీ మార్కులు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు కె.పుల్లన్న, రామాంజనేయులు, కవిత పాల్గొన్నారు.

స్థలం కబ్జా కాకుండా చూడాలి

- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిమ్ రోడ్డులో ఉన్న ఎల్ఐజి కాలనీ చిన్న పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. గురువారం ఆయన ఆదోని మున్సిపల్ కమిషనర్‌కు, అనంతపురం ఆర్‌జెడికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిత్య నర్సింగ్ హోమ్ పక్కన పార్కు స్థలం ఉందన్నారు. దానికి ఎదురుగా ఉన్న పార్కును కూడా గతంలో ఫిర్యాదు చేసి కాపాడినట్లు తెలిపారు. పార్కు స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నా సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు, టిపిఒ, ఎసిపి ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పట్టణ ప్రణాళిక ఉద్యోగులు తమ వృత్తికి న్యాయం చేస్తూ అప్పుడప్పుడు వీధుల్లో, రోడ్లపై సంచరిస్తూ కబ్జాలను, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ పార్కును సర్వే చేసి స్వాధీనం చేసుకుని చుట్టూ ప్రహరీ కట్టాలని కోరారు. పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు వ్యాయామానికి వచ్చే విధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు.

ఇద్దరు కౌన్సిలర్లకు నోటీసులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఇద్దరు కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ గురువారం తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి వరసగా గైర్హాజరవుతున్న 23, 24వ వార్డుల కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చామని, సంజాయిషీ ఇవ్వాలని కోరారు.

అందని కూలిలు..!

- ఆరు వారాలుగా పెండింగ్
- ఉపాధి కూలీల ఆందోళన

ప్రజాశక్తి - హోళగుంద

గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కూలిపోతే కుండకాలే అన్న చందంగా ఉన్నాయి ఉపాధి కూలీల బతుకులు. ఉపాధి హామీ చట్టంలో ఆరు వారాలుగా ఉపాధి కూలిలు అందలేదు. కూలిలు పెండింగ్‌లో ఉండడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. వారానికోసారి కాకపోయినా కనీసం రెండు వారాలకైనా ఉపాధి కూలిలు చెల్లిస్తే తమ బతుకులు సజావుగా సాగుతాయని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది బెంగళూరు, ముంబయి, మహారాష్ట్ర తదితర సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. వలసలు వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ మండల అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులు కల్పించడంలో.. సకాలంలో బిల్లులు చెల్లించడంలో ఉపాధి మండల అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కూలి డబ్బులు అడిగితే 'పెట్టాం. వస్తాయిలే' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కూలీలు మండిపడుతున్నారు. సకాలంలో కూలిలు ఇవ్వకుంటే తమ పరిస్థితి ఏమిటని మండల అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇలా కూలిలు ఇవ్వకుండా కాలయాపన చేస్తే బతుకుదెరువు కష్టంగా మారి తాము కూడా వలసలు వెళ్లక తప్పదు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 31, 2025 వరకు హోళగుంద మండలానికి 3.74 లక్షల పని దినాలు కల్పించాలని జిల్లా అధికారులు సూచన. మండలంలో కేవలం 3.08 లక్షల పని దినాలు కల్పించినట్లు సమాచారం. జులై, ఆగస్టు నెలలో ప్లాంటేషన్ కింద పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి గల రైతులకు మామిడి, జామ, టెంకాయ తదితర మొక్కలు అందించారు. ఇంతవరకు వాటి సంరక్షణకు నయా పైసా కూడా ఇవ్వలేదు. మొక్కలు పెంచుకుంటున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.



పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వలస వెళ్లక తప్పడం లేదు

- షేకన్న, ఉపాధి కూలీ



ఇలా అయితే వలసలు వెళ్లక తప్పడం లేదు. వలస వెళ్లకండి.. ఉపాధి పనులు కల్పిస్తాం.. కూలి డబ్బులు కూడా వారానికోసారి వచ్చేటట్లు చూస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కూలి డబ్బులపై ఫీల్డ్ అసిస్టెంట్ ఎపిఎంను అడిగితే.. 'మీరు చేసిన పని దినాలకు కూలిలు అప్‌లోడ్ చేసి పంపే వరకే.. మా పని ఎప్పుడొస్తే.. అప్పుడు తీసుకోవాల'ని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. సంబంధిత అధికారులు కూలిలు అందేలా చర్యలు తీసుకుని మమ్మల్ని ఆదుకోవాలి.

కూలీలు అందక అవస్థలు

- మృత్యుంజయ, ఉపాధి కూలీ



ఉపాధి పనులకు వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ చూపించిన కొలతల ప్రకారం పనులు చేశాం. ఆరు వారాలుగా కూలి డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా లేవు. ప్రస్తుతం ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్నాం. ప్రస్తుతం కిరాణం, కూరగాయల కోసం వెళితే 'ఇకపై అప్పులు ఇవ్వలేం' అని అంటున్నారు. ఇలా అయితే కష్టమవుతుంది. వెంటనే కూలి డబ్బులు అందించి ఆదుకోవాలి.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు, పట్టణ నాయకులు రాముడు విమర్శించారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విభజన హామీలను విస్మరించి, సాగునీటి ప్రాజెక్టులకు, వెనుకబడిన ప్రాంతాలకు నిధుల కేటాయించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులు వేదవతి, గుండ్రేవుల సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి కూడా బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా బడ్జెట్‌లో కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. సిపిఎం పట్టణ నాయకులు అబ్దుల్లా, సురేష్, రమేష్, తిమ్మన్న, సుభాన్, కృష్ణ, ఆంథోని, రాజు, గుంటప్ప, బజారి, మోహన్ పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - మంత్రాలయం




అవగాహన కల్పిస్తున్న సిఐ

సమాజంలో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఐ రామాంజులు సూచించారు. గురువారం మండలంలోని చిలకలడోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, వేధింపులు, అఘాయిత్యాలతో పాటు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు.

బిల్లేకల్లులో గుడిసె దగ్ధం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో బోయ ఉచ్చీరప్ప గుడిసె గురువారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విద్యుదాఘాతమా, లేక ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందో తెలియాల్సి ఉంది. బాధిత కుటుంబం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో ఇంటికి తాళం వేసి ఉన్నారు. ఉదయం 10 గంటలకు గుడిసెలో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో కాలనీవాసులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. మంటలు ఎగిసి పడడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పత్తికొండ నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపు చేసింది. బాధిత కుటుంబ యజమాని స్థానికంగా లేకపోవడంతో నష్టం ఏమేర జరిగిందో తెలియాల్సి ఉంది. ఇన్‌ఛార్జీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, విఆర్ఒ మల్లికార్జున సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తరఫున ఇల్లు మంజూరుకు కృషి చేస్తామన్నారు.



7 గడ్డివాములు దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని మిట్టాసోమాపురం గ్రామంలో ప్రమాదవశత్తు 7 గడ్డివాములు దగ్ధమయ్యాయి. రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. తెలుగు రామలింగడు, ఆరెకంటి నాగరాజు, ఆరెకంటి పురుషోత్తం, తెలుగు వీరేష్‌కు చెందిన 7 గడ్డివాములు దగ్ధమయ్యాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. అనుకోకుండా గడ్డి వాముల దగ్గర మంటలు రావడంతో గ్రామస్తుల సహకారంతో మంటలు అదుపు చేయటానికి ప్రయత్నించామని తెలిపారు. మంటలు అదుపు కాకపోవడంతో ఆరు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్పందించిన అగ్నిమాపక శాఖ అధికారులు త్వరగా రావడంతో మంటలు అదుపు చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో 15 గడ్డివాములు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలు అదుపు చేయడంతో మిగిలిన గడ్డివాములకు ప్రమాదం తప్పింది.



దగ్ధమవుతున్న గడ్డివాములు

పాఠశాల కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించాలి

- ఎంపీ నాగరాజుకు, టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్‌కు వినతి

ప్రజాశక్తి - హోళగుంద

పాఠశాల కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించాలని ఇంగలదహాల్ గ్రామస్తులు, పెద్దగోనెహాల్, ఎమ్‌డి.హళ్లి సర్పంచులు, పెద్దలు, కెసిటిఆర్ యూత్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం ఆలూరులో నిర్వహించిన జాబ్‌మేళాకు వచ్చిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంగలదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండలంలోనే పురాతన పాఠశాలలో ఒకటని, 1964 నుంచి పాఠశాల కొనసాగుతోందని తెలిపారు. పాఠశాల ప్రారంభం నుంచి పాఠశాల కాంప్లెక్స్‌గా కొనసాగుతోందని, పాఠశాలకు 7.65 ఎకరాల ఆట స్థలం, అన్ని వసతులతో 16 విశాలమైన గదులతో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ కూడా ఉందని చెప్పారు. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఉన్నారని, రవాణా సౌకర్యం ఉందని తెలిపారు. ఇన్ని అర్హతలు ఉన్నా గుర్తించకుండా ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కాంప్లెక్స్‌గా చేయడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని విషయాలను పరిశీలించి విద్యాశాఖ అధికారులతో చర్చించి ఇంగలదహాల్ పాఠశాలను కాంప్లెక్స్‌గా కొనసాగించాలని కోరారు. స్పందించిన ఎంపీ, ఇన్‌ఛార్జీ మాట్లాడుతూ... ఈ విషయంపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్‌డి.హళ్లి సర్పంచి సుధాకర్, ఇంగలదహాల్ ఉప సర్పంచి మహంతేష్, టిడిపి నాయకులు హనుమంతు, చంద్ర, నాగరాజు, యూత్ అసోసియేషన్ సభ్యులు మల్లికార్జున, మోహన్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు